'కేసీఆర్ కళాభారతి' పేరు మార్పుపై నిరసన

- మిర్యాలగూడలో బీఆర్ఎస్ శ్రేణుల అభ్యంతరం, ఆందోళన
- ప్రభుత్వతీరుపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, మే 2: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో 'కేసీఆర్ కళాభారతి' నుంచి కేసీఆర్ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ స్థానిక మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.10కోట్లతో ప్రతిష్టాత్మకంగా మినీ రవీంద్రభారతిని నిర్మించి దానికి 'కేసీఆర్ కళాభారతి' అని పేరుపెట్టారు. మున్సిపల్ అధికారులు గురువారం కేసీఆర్ కళాభారతిలో నుంచి కేసీఆర్ పేరును తొలగించారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ అధికారులను నిలదీస్తే .. స్థానిక ఎమ్మెల్యే చెప్పడంతో కేసీఆర్ పేరును తొలగించినట్టు వివరించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి కళాభారతి వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్, సబ్ కలెక్టర్‌కు కేసీఆర్ పేరును వెంటనే చేర్చాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పోటీపడి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని, గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఆనవాళ్లు తొలగించడం ప్రజాస్వామ్యంలో మంచి సంస్కృతి కాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కట్టారని, ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఖాళీ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ కళాభారతి రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత సుందరంగా నిర్మించిన కళావేదిక అని చెప్పారు. కేసీఆర్ పేరు తొలగించినంత మాత్రాన ప్రజల నుంచి ఆయన దూరం కారని, ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిదికాదని హితవుపలికారు. గత ప్రజాప్రతినిధులు వారి నాయకుల పేర్లు అభివృద్ధి పనులకు పెట్టుకున్నారని, తన హయాంలో వాటిపై ఎటువంటి అభ్యంతరాలు తెలుపలేదని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, దుర్గంపూడి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ కళాభారతి ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

భద్రత లేని భాగ్యనగరి!

- కుటుంబంతో కలిసి స్వేచ్ఛగా బయటకు వెళ్లలేని పరిస్థితులు
- కుటుంబంతో ఉన్న యువతిని వెంబడించి వేధించిన అకతాయిలు
- ఫోన్‌నంబర్ ఇవ్వు' అంటూ భర్త ఎదుటే వేధింపులు
- బేగంపేట నుంచి రహ్మత్‌నగర్ వరకు వెంటపడి.. ఎస్ఆర్‌నగర్ వద్ద భర్తపై దాడి

వెంగళరావునగర్, మే 2 : హైదరాబాద్‌లో కామాంధులు బరితెగించారు. భర్త ఎదుటే భార్యను వేధించారు. 'నన్నే నీ భర్త అనుకో.. నీ ఫోన్ నంబర్ ఇవ్వు' అంటూ దారికి అడ్డంగా నిలబడి బీరు బాటిళ్లతో బెదిరించారు. భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి పబ్‌కు వెళ్లి ఇంటికి తిరిగొస్తుండగా యువతిని వెంబడించారు. దౌర్జన్యానికి దిగి ఫోన్లతోపాటు బైక్‌ను లాక్కొని దాడికి పాల్పడ్డారు. బాధిత కుటుంబం డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ముగ్గురు కామాంధులను కటకటాల్లోకి నెట్టారు పోలీసులు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన ఒక యువతి (29) తన భర్త, మరిది, ఆడపడుచుతో కలిసి రహ్మత్‌నగర్‌లోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. గురువారం సాయంత్రం ఆ యువతి తన భర్త, మరిది, ఆడపడుచు, తమ బంధువుల స్నేహితుడితో కలిసి బేగంపేటలోని క్లబ్-8 అనే పబ్‌కు వెళ్లారు. అనంతరం రాత్రి 11.40 గంటల సమయంలో పబ్ నుంచి బయటకు వస్తుండగా కామాంధులు అడ్డగించారు. తాను భర్తతో కలిసి వచ్చానని యువతి చెప్పగా.. 'నన్నే నీ భర్త అనుకో.. ఫోన్ నంబర్ ఇవ్వు' అంటూ వేధించారు. బీరు బాటిళ్లు చేతబట్టుకొని బెదిరించారు. బేగంపేట నుంచి రహ్మత్‌నగర్‌లోని ఇంటికొచ్చే వరకూ దారిపొడవునా ఆ కామాంధులు వెకిలిచేష్టలతో వెంబడిస్తూ వేధించారు. అనంతరం యువతిని ఇంట్లో దిగబెట్టిన ఆమె భర్త.. తన స్నేహితుడ్ని డ్రాప్ చేయడానికి మాదాపూర్ వెళ్తుండగా.. ఆ ముగ్గురు వ్యక్తులు ఎస్ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద అడ్డగించి దాడికి పాల్పడ్డారు. వారు ప్రయాణించే బైక్‌తోపాటు ఫోన్లను బలవంతంగా లాక్కున్నారు. డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. డీ సంపత్ (28), సందీప్ (28), ఉమేశ్ (28)లను అరెస్టు చేశారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు!

- పిల్లల్లేరని, ఆస్తి తగాదాలతో నిత్యం వేధింపులు
- భార్యకు ఉరివేసి హతమార్చిన భర్త

కొడిమ్యాల, మే 2 : తమకు సంతానం లేకపోవడంపై కుటుంబ సభ్యుల నుంచి సూటిపోటి మాటలు, దానికితోడు అన్నదమ్ములతో ఆస్తి తగాదాలు.. అన్నింటికీ భార్యే కారణమని భావించిన భర్త ఆమెను కడతేర్చాడు. ఇంట్లోనే ఉరివేసి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. వారం తర్వాత తాళం పగులగొట్టిన పోలీసులకు ఇంట్లో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ నీలం రవి, ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాలకు చెందిర అవుదుర్తి మహేందర్‌కు, గంగాధర మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మమత(35)తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఉపాధి కోసం మమత, మహేందర్ కరీంనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. గత సంవత్సరం కాలంగా అత్త, మామలు వజ్రవ్వ, లక్ష్మణ్, మరుదులు అనిల్, వెంకటేశ్‌లతో మమతకు వేధింపులు ఎక్కువయ్యాయి. మహేందర్ కూడా వారికి వంతపాడటం ప్రారంభించాడు. ఆస్తి తగాదాతోపాటు సంతానం లేదంటూ మానసికంగా వేధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో మహేందర్ తన భార్యను చంపాలని నిర్ణయించుకుని, గత నెల 26న ఆమెను కొడిమ్యాలలోని తమ ఇంటికి తీసుకొచ్చాడు. ఇంట్లో తాడుతో మెడకు ఉరి వేసి హత్య చేశాడు. సాయంత్రం మమత కనపడడం లేదంటూ వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. దీంతో గత నెల 28న కరీంనగర్‌లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మమత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మహేందర్‌ను, అతని తల్లిదండ్రులను మమత గురించి నిలదీయగా దాటవేసే ప్రయత్నం చేశారు. అనుమానంతో శుక్రవారం కొడిమ్యాలలోని ఇంటి తాళాలు పగులగొట్టి చూడగా మమత మృతదేహం ఉన్నది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, సీఐ, ఎస్ఐ పరిశీలించి మృతదేహాన్ని జగిత్యాల దవాఖానకు తరలించారు. మమత తల్లి రాచకొండ పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేందర్‌తోపాటు వారి తల్లిదండ్రులు, ఇద్దరు తమ్ముళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

మరోసారి సీడబ్ల్యూసీకి పాలమూరు డీపీఆర్

- అధికారులకు మంత్రి ఆదేశం

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి మరోసారి సమర్పించాలని తెలంగాణ సర్కారు తుదకు నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో జలసౌధలో శుక్రవారం మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్రాష్ట్ర అంశాలు, ఎన్జీటీ కేసులు, ప్రాజెక్టుల డీపీఆర్‌పై ఆరా తీశారు. ఈ క్రమంలో పాలమూరు ప్రాజెక్టుపైనా మంత్రి చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని (పీఆర్ఎల్ఐఎస్) రూ.35 వేల కోట్ల అంచనా వ్యయంతో 2015లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. మైనర్ ఇరిగేషన్‌లో వినియోగించుకొని 45 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను మొత్తంగా 90టీఎంసీల నికర జలాలను పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేటాయించారు. డీపీఆర్‌ను సిద్ధం చేసి 2022 సెప్టెంబర్‌లో సీడబ్ల్యూసీకి బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే సమర్పించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) నుంచి పర్యావరణ అనుమతుల కోసం 34వ ఈ ఏసీ సమావేశం నుంచే తీవ్ర ప్రయత్నాలను చేసింది. ఎట్టకేలకు 49వ ఈఏసీ అంగీకరించింది. ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. ఏడాదిన్నర గడిచినా కేంద్రం అనుమతులను మంజూరు చేయలేదు.

కాంగ్రెస్ వచ్చాక తీరని జాప్యం

కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్రం ఏకంగా డీపీఆర్‌ను తిప్పి పంపింది. మైనర్ ఇరిగేషన్ ద్వారా ఆదా చేసే 45.66 టీఎంసీల వివరాలు ఇవ్వాలని అడిగినా, లేఖలు రాసినా కాంగ్రెస్ సర్కారు స్పందించడం లేదని సీడబ్ల్యూసీ ఆక్షేపించింది. గోదావరి నీటిని మళ్లించడం ద్వారా 45టీఎంసీల అంశం కూడా ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నదని వెల్లడించింది. దానిపైనా స్పష్టత ఇవ్వాలని లేఖలు రాసినా స్పందించడం లేదని తెలిపింది.

మిగిలింది మూడు రోజులే!

- 6 అర్ధరాత్రి నుంచే సమ్మెకు పిలుపు
- చర్చల ఊసెత్తి సర్కార్ సైలెంట్
- యాజమాన్యం నుంచీ స్పందన కరువు
- 7న ఉదయం నుంచే డిపోల్లో నిలిచిపోనున్న బస్సులు
- డిపోల్లో సమ్మె సన్నాహాల్లో జేఏసీ

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఈ నెల 6న అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ యాజమాన్యానికి కార్మిక సంఘాలు నోటీసులు ఇచ్చాయి. సమ్మె యోచనను విరమించాలంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కానీ, శుక్రవారం సాయంత్రం వరకూ ప్రభుత్వం నుంచి, ఆర్టీసీ యాజమాన్యం నుంచి స్పందన రాలేదు. ఇక మిగిలింది మూడురోజులే. ఈ మూడురోజుల్లోపే ఏవైనా చర్చలు జరిగి సఫలమైతేనే సమ్మె యోచనను విరమిస్తామని, లేకుంటే యథాతథంగా సమ్మె జరుగుతుందని, 7న ఉదయం నుంచే అన్ని డిపోల్లో బస్సులు నిలిచిపోనున్నాయని కార్మిక సంఘాలు తేల్చిచెప్పాయి. 'ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటాం.. ఇప్పుడు సమ్మెకు వెళ్తే ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న ఆర్టీసీ ఆగమవుతుంది. మీతో చర్చలు జరిపేందుకు నాకు ఎలాంటి భేషజాలు లేవు' అని సాక్షాత్తూ సీఎం చెప్పినా కూడా ఆర్టీసీ కార్మిక సంఘాలను సంప్రదించినవారే లేరు. సమ్మె గడువు దగ్గర పడుతుండగా చర్చల ఊసెత్తి సైలెంట్‌గా ఉన్న సర్కార్ తీరుపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వ్యాఖ్యల మేరకు ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం చర్చలకు పిలుస్తుందని ఆశించిన కార్మిక సంఘాల నేతలకు తీవ్ర నిరాశే ఎదురైంది. సమ్మె తేదీ తాము ప్రకటించామని, కనీసం చర్చల తేదీని యాజమాన్యం ప్రకటిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూశామని కార్మిక సంఘాల నేతలు చెప్పారు. సీఎం చొరవ తీసుకోకపోతే ఆర్టీసీ సమ్మె కచ్చితంగా జరిగి తీరుతుందని స్పష్టంచేశారు.

మొదటి దఫా చర్చలు విఫలమైతే?

సమ్మెపై ఈ ఆదివారం సాయంత్రం లేదా సోమవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు ఆహ్వానిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని ప్రభుత్వం మొదటిరోజు చర్చల్లో స్వాగతిస్తుందా? వ్యతిరేకిస్తుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఎందుకంటే సీఎం రేవంత్‌రెడ్డి 'రాష్ట్రం అప్పుల్లో ఉన్నది. సరిపడా జీతాలు ఇచ్చేందుకే నిధులు సరిపోవడం లేదు. అన్నీ ఇప్పుడే చేయలేను. ఉద్యోగులు ఆలోచన చేయాలి. నేనేం చేయాలో మీరే చెప్పండి' అంటూ సీఎం పదేపదే వల్లె వేస్తున్నారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే ఆ భారం ఆర్థికశాఖపై పడుతుందని ముందే బేరీజు వేసుకున్న ప్రభుత్వ పెద్దలు.. ఈ నిర్ణయాన్ని స్వాగతించరనే అనుమానాలు కార్మికుల్లో సైతం రేకెత్తుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మిక సంఘాలు పట్టుబడితే.. మొదటి దఫా చర్చలు విఫలమయ్యే అవకాశాలు లేకపోలేదని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. తమ సమ్మె డిమాండ్లపై ప్రభుత్వం స్పందిస్తుందనే ఆశతోనే ఇంకా ఆర్టీసీ కార్మిక సంఘాలు ఉన్నాయి. మేడే రోజు సీఎం చేసిన వ్యాఖ్యలను స్వాగతించాయి. సమ్మెపై ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తే నిరభ్యంతరంగా వెళ్తామని, ఒకవేళ చర్చలకు పిలువకపోతే సమ్మెకు వెళ్తామని కరాఖండిగా చెప్తున్నారు.

6వ తేదీ అర్ధరాత్రి నుంచే..

ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచే అన్ని డిపోల్లో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోనున్నాయి. 7వ తేదీ ఉదయం నుంచే సమ్మె పూర్తిస్థాయిలో ప్రారంభం అవుతుందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక నేతలు సమ్మె సన్నాహాల్లో ఉన్నారు. ఇప్పటికే సమ్మె సన్నాహక పోస్టర్లు అన్ని డిపోలకు చేరాయి. ఆయా డిపోల్లో ఆ పోస్టర్లను ఆవిష్కరించి, బస్సులకు, డిపోల్లో, జనం అధికంగా ఉండే ప్రాంతాల్లో అతికిస్తున్నారు. ఇక తాము చేసేదేమీ లేదని, చేయాల్సిందంతా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానిదేనని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు.

హోంగార్డులకు హెల్త్‌కార్డులు లేనట్టేనా?

- ప్రైవేట్ హెల్త్‌కార్డులే తీసుకోవాలని అధికారుల ఒత్తిడి
- వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు పంపుతున్నవైనం

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): హోంగార్డులు ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురుచూస్తున్న హెల్త్‌కార్డులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులోకి వస్తే హోంగార్డులకు హెల్త్‌కార్డులు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర గడుస్తున్నా పట్టించుకోవడం లేదని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హోంగార్డులందరూ ప్రైవేట్ హెల్త్‌కార్డులు తీసుకోవాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని సమాచారం. పోలీసులకు కల్పించే ఆరోగ్య భద్రత హోంగార్డులకు వర్తించదు కాబట్టి.. కచ్చితంగా ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని అధికారులు సందేశాలు పంపుతున్నారని తెలుస్తున్నది. ఈ మేరకు వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారని హోంగార్డులు వెల్లడిస్తున్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వం హెల్త్‌కార్డులు ఇస్తుందని ఎదురుచూసిన హోంగారులు.. ఇప్పుడు అధికారుల సందేశాలు చూసి గాబరా పడుతున్నారు. ఇప్పటికే కారుణ్య నియామకాలకు తిలోదాకాలిచ్చిన ప్రభుత్వం హెల్త్‌కార్డులకు కూడా మంగళం పాడినట్టే కనిపిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు పెట్టకుండా హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్డర్లీ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికీ రిటైర్డ్ అయిన ఐపీఎస్ అధికారుల ఇండ్లలో హోంగార్డులతో సేవలు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అకాడమీలో మరీ దారుణంగా మున్సిపల్ వర్కర్ చేసే అన్ని పనులనూ హోంగార్డులతో చేయిస్తున్నారని, ఆ విధానాన్ని తక్షణం ఆపాలని కోరుతున్నారు.

గ్రూప్ 1లో వరుస తప్పులు

మొదటిపేజీ తరువాయి...

చేసిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గ్రూప్-1 పరీక్షల్లోనూ అలాంటి పరిస్థితులే ఉన్నాయని తెలిపారు. మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు విచారణ చేపట్టారు. వాదనలు పూర్తికాకపోవడంతో విచారణను జూన్ 11వ తేదీకి వాయిదా వేశారు. సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చని, కానీ నియామకపత్రాలు జారీ చేయరాదంటూ గతంలో జారీచేసిన మధ్యంతర ఉత్వర్వులు కొనసాగుతాయని కోర్టు స్పష్టంచేసింది. పునర్ మూల్యాంకనం కోరితే మార్కులు తగ్గిపోయాయని ఒకవైపు, మార్కుల జాబితాను ఫోర్జరీ చేశారంటూ మరోవైపు వాదప్రతివాదులు ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో అభ్యర్థి పూజితారెడ్డి జవాబు పత్రాలను సమర్పించాలని టీజీపీఎస్సీకి నోటీసులు జారీచేసింది. ప్రతివాదిగా చేర్చినందున పూజితారెడ్డికి నోటీసులు జారీచేస్తున్నట్టు తెలిపింది.

టీజీపీఎస్సీ సమర్థన దారుణం

దేశంలో ఎక్కడైనా ఒక పరీక్షకు ఒకే హాల్‌టికెట్ ఉంటుందని, కానీ తొలిసారి గ్రూప్-1 పరీక్షలకు రెండు హాల్‌టికెట్లు ఇవ్వడమే కాకుండా, ఈ చర్యను టీజీపీఎస్సీ సమర్థించుకోవడం దారుణమని రచనారెడ్డి వాదించారు. హాల్‌టికెట్ నంబర్ల మార్పు నుంచి కేంద్రాల ఎంపిక, ఎవాల్యుయేటర్ల నియామకం వంటివి చేయడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని అన్నారు. గ్రూప్-1 మెయిన్ పరీక్ష రాసిన సంఖ్య మొదట ప్రకటించిన దానికి, తర్వాత వెల్లడించిన దానికి మధ్య 1000 మంది తేడా ఉందంటే ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్నారని టీజీపీఎస్సీ చెప్తున్న వ్యక్తి ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ అక్కడి నుంచి వేతనం తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దాదాపు 40 శాతం మంది తెలుగులో, 10 నుంచి 12శాతం మంది ఉర్దూలో, మిగిలిన వారు ఇంగ్లిష్‌లో పరీక్ష రాశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకనం కోసం నియమించిన వారిలో తెలుగు ఎంత మందికి వచ్చన్న విషయాన్ని సర్వీస్ కమిషన్ వెల్లడించలేదని తెలిపారు. వ్యాల్యుయేషన్ చేసే వారికి తెలుగు వస్తే సరిపోదని, తెలుగుపై పూర్తి ఆధిపత్యం ఉండాలని చెప్పారు. తెలుగు వారికే మార్కులు ఎందుకు తక్కువ వస్తున్నాయో తేల్చాలని కోరారు.

సీల్డ్ కవర్‌లో జవాబు పత్రాలు

టీజీపీఎస్సీ తరపు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ తదుపరి విచారణ నాటికి మార్కుల జాబితాను, జవాబు పత్రాలను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని చెప్పారు. వాటిని పరిశీలిస్తే పిటిషనర్ల అనుమానాలకు తెరపడుతుందన్నారు. ఫోర్జరీ మార్కుల జాబితా సమర్పించారని స్పష్టమైనందున కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండా కేసును కొట్టివేయాలని కోరారు. గతంలో ఇలాగే, ఇదే హైకోర్టు కొట్టివేసిందని గుర్తుచేశారు. పిటిషన్లపై విచారణను కావాలని కాలయాపన చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాది రచనారెడ్డి జోక్యం చేసుకుంటూ వాదనలు హడావుడిగా పూర్తిచేస్తే అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. దీనిపై హైకోర్టు జోక్యం చేసుకుంటూ ఇది నిరుద్యోగుల జీవితాలకు సంబంధించిన వ్యవహారమని హితువు పలికింది.

పేరు తొలగించాలని విన్నపం

గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో ఓ అభ్యర్థికి రీకౌంటింగ్‌లో తక్కువ మార్కులొచ్చాయని తప్పుడు మెమో పెట్టిన వ్యవహారంలో తనపై విచారణ ఉపసంహరించాలని సంగారెడ్డి జిల్లా లింగంపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న షబ్నం ఆర్య హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

మూడో మూల్యాంకనం

కోఠి మహిళా కళాశాలలోని 18వ సెంటర్‌లో 721 మంది మెయిన్స్ పరీక్ష రాస్తే 39 మంది, అదే కళాశాలోని 19వ సెంటర్‌లో 776 మంది పరీక్ష రాస్తే వారిలో 32 మంది ఎంపికయ్యారని రచనారెడ్డి వివరించారు. మొత్తం 563 మందిలో సుమారు 12శాతం మెయిన్స్‌కు అర్హత పొందడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. రెండుసార్లు జరిపిన మూల్యాంకనంలో 15శాతం తేడా ఉంటే మూడో మూల్యాంకనం జరుగుతుందని నిబంధనల్లో ఉన్నదని గుర్తుచేశారు.

బాబు బాటలో తెలంగాణ పాలన!

- ఆంధ్ర క్యాడర్ రిటైర్డ్ ఐఏఎస్‌కు సీఎంవో నడిపే కీలక బాధ్యతలు
- మూసీ సుందరీకరణ పనుల కాంట్రాక్టు మెయిన్ హార్ట్‌కు
- ఊరు పేరు లేని ఉర్సా కంపెనీతో వేల కోట్లతో ఒప్పందం..!
- పీసీబీ అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా ఏపీకి చెందిన జస్టిస్ సాంబశివరావుకు కీలకమైన నీళ్ల సలహాదారుడి పోస్టు కూడా ఆంధ్ర ఐఏఎస్‌కే అప్పగింత
- ఏపీ మరో రిటైర్డ్ ఐఏఎస్‌కు మానవ హక్కుల కమిషన్ సభ్యుని పదవి

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే తెలంగాణ రాష్ట్ర పరిపాలన సాగుతున్నదా? అమరావతిలో ఉండి ఆయన కన్ను గీటితేనే హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఫైళ్లు కదులుతున్నాయా? ఓ అధికారికి కీలక బాధ్యతలు కట్టబెట్టడం వెనుక పొరుగు రాష్ట్రం నేత హస్తం ఉన్నదా? ఆయన ముందుచూపుతోనే ఆంధ్రలోని రిటైర్డ్ ఐఏఎస్‌లను వ్యూహాత్మకంగా తెలంగాణలో కీలక పోస్టుల్లోకి చొప్పిస్తున్నారా? తెలంగాణ సీఎంవో పూర్తిగా ఆ.. బాబు చేతుల్లోకి వెళ్లిపోయినట్టేనా? తెలంగాణ భవిష్యత్తు నిర్ణయాలు ఇకపై అమరావతిలోనే ఖరారవుతాయా? ఉర్సా కంపెనీతో వేల కోట్ల ఒప్పందం, గోడి ఇండియా గోడ కంపెనీతో ఒ ప్పందం వెనుక ఆయన ఆదేశాలే ఉన్నాయా? మూసీ రివర్‌ఫ్రంట్ పనులకు మెయిన్‌హార్ట్‌ను పంపింది ఆయనేనా? అంటే అన్ని ప్రశ్నలకు 'అవును' అనే సమాధానమే వినిపిస్తున్నది. చక్రం తిప్పటంలో సిద్ధహస్తుడిగా పేరున్న పొరుగు రాష్ట్ర సీఎం తెలంగాణ పరిపాలనలో చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మన గుట్టు పొరుగు రాష్ట్రానికి..

తెలంగాణలో తెలివిగల అధికారులే లేరన్నట్టు ఇక్కడి కీలక పదవుల్లో అత్యధికం ఏపీ మూలాలున్న వ్యక్తులకు అప్పగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ వచ్చిన కొత్తలో కృష్ణా, గోదావరి నదీ జలాల వాటా కోసం ఏపీ తరపున కొట్లాడిన ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్‌దాస్‌ను తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించారు. కీలక నిర్ణయాలతో పరిపాలనను పరుగులు పెట్టించే సీఎం ముఖ్యకార్యదర్శి పోస్టును తాజాగా వీఆర్ఎస్ తీసుకున్న ఆంధ్ర క్యాడర్ ఐఏఎస్‌కు అప్పగించారు. దీంతో తెలంగాణ పరిపాలన గుట్టంతా రాచమార్గంలో ఆంధ్రా పాలకుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్‌గా ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి డాక్టర్ శివశంకర్‌రావును నియమించారు. ఆయన స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలంలోని సాకుర్రు గ్రామం. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అప్పిలేట్ అథారిటీ చైర్మన్‌గా ఏపీకి చెందిన జస్టిస్ సాంబశివరావును నియమించారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడిగా ఆంధ్ర మూలాలున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ బీ కిశోర్‌ను నియమించారు. కీలక పదవులు అన్నీ ఆంధ్ర అధికారులతో నింపటంతో తెలంగాణ ప్రభుత్వ జీవోలు, ప్రయోజనాలు, పథకాల రహస్యం, ప్రభుత్వ వ్యూ హాలు అంతా ఆంధ్రా పాలకుల చేతిలో పెట్టినట్టు అయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిండాముంచినోడి చేతికే నీళ్ల బాధ్యతలు...

కీలకమైన జలవనరుల్లో వాటా కోసం ఆంధ్రతో మనకు నిత్యం ఘర్షణ జరుగుతున్నది. ప్రధానంగా కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం న్యాయస్థానాల్లో పోరాటం కొనసాగుతున్నది. గోదావరి జలాల్లో వాటాల మీద కూడా ఇదే తరహా వివాదాలు నడుస్తున్నాయి. ఇలాంటి సంక్లిష్ట సమయంలో పొరుగు రాష్ట్రం ఎత్తులకు జిత్తులకు అందకుండా ఎన్న